క్లుప్తంగా

ఈఏపీ సెట్‌కు 281 మంది హాజరు

రాజానగరం: వెలుగుబంద సమీపంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ(జీఈయూ)లో మంగళవారం జరిగిన ఏపీ ఈఏపీ సెట్‌కు 290 మందికి గాను 281 మంది హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ ఈవీ రమణారెడ్డి ఈ విషయం తెలిపారు. ఉదయం సెషన్‌కు 145 మందికి గాను 141 మంది, మధ్యాహ్నం సెషన్‌కు 145 మందికి గాను 140 మంది హాజరయ్యారని వివరించారు.

'విద్యామిత్ర'తో సత్ఫలితాలు

బొబ్బిలుంక జెడ్పీహెచ్ స్కూల్లో వేసవి తరగతుల్లో విద్యార్థులు

సీతానగరం: జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యాన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న విద్యామిత్ర వేసవి తరగతులకు సత్ఫలితాలనిస్తున్నాయని బొబ్బిలుంక జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కోలా సత్యనారాయణ మంగళవారం తెలిపారు. పాఠశాలల్లో గత 15 రోజులుగా ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో భాగంగా విద్యార్థులకు ఆటపాటలతో పాటు, భాషా నైపుణ్యాలు, గణిత ప్రక్రియలపై ఆసక్తి పెంపొందించడానికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఈ తరగతులకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సైతం హాజరవుతున్నారన్నారు. వారిలో కొంత మంది స్వచ్ఛందంగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు వి.సత్యనారాయణ, జి.సింగారావు, రత్నప్రసాద్ కోఆర్డినేటర్లుగా వ్యవహరిస్తున్నారని, తరుణ్ దేవి, రేష్మ వలంటీర్లుగా సేవలందిస్తున్నారని సత్యనారాయణ తెలిపారు.

నాణ్యమైన విత్తనాలే విక్రయించాలి

కోరుకొండ: రైతులకు నాణ్యమైన విత్తనాలే విక్రయించాలని, లేకుంటే చట్ట పరమైన చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ కోరుకొండ సబ్ డివిజన్ సహాయ సంచాలకుడు (ఏడీఏ) డి.శ్రీనివాసరావు అన్నారు. కాపవరంలోని తన కార్యాలయంలో కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలకు చెందిన విత్తన డీలర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి పొందిన కంపెనీల విత్తనాలే రైతులకు అమ్మాలని, ఆ సందర్భంగా రైతుల అంగీకారం తీసుకోవాలని అన్నారు. సంతకాలతో కూడిన బిల్లు విధిగా ఇవ్వాలన్నారు. బిల్లు పుస్తకంలో రైతుల సంతకాలు తీసుకోవాలన్నారు. విత్తనాల నిల్వలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దుకాణాల్లో రసాయన ఎరువులు, పురుగు మందుల వద్ద విత్తనాలు ఉంచరాదని, అలా చేస్తే అవి జీవాన్ని కోల్పోతాయని సెప్పారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ, సబ్ డివిజన్‌లో 30 విత్తన దుకాణాలున్నాయని తెలిపారు. భూసార పరీక్షలకు అనుగుణంగా విత్తనాలివ్వాలని అన్నారు. ఈ మండలాల్లోని 12 వేల మంది రైతులు 34 వేల ఎకరాల్లో ఖరీఫ్ పని సాగు చేపడుతున్నారని చెప్పారు.

అలరించిన నందిని గాత్ర కచేరీ

గాత్ర కచేరీ చేస్తున్న నందిని

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): తిరువనంతపురానికి చెందిన డాక్టర్ ఎన్‌జే నందిని గాత్ర కచేరీ శ్రోతలను అలరించింది. శ్రీ త్యాగరాజ దాస సేవా సమితి అమృతోత్సవం సందర్భంగా గోదావరి గట్టున సమితి ప్రాంగణంలో నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు జనరంజకంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏడో రోజైన మంగళవారం సాయంత్రం నందిని గాత్ర కచేరీ జరిగింది. వీబీ దుర్గా భవాని వయోలిన్, బీవీఎస్ ప్రసాద్ మృదంగం, సరస్వతుల హనుమంతరావు ఘటంపై సహకారం అందించారు. సమితి గౌరవ ఛైర్మన్ వాడ్రేవు వెంకట రమణారావు, వైస్ఛైర్మన్ సీఎస్ వెంకటరావు, ప్రిన్సిపాల్ సెక్రటరీ జోన్యూల సరస్వతి, పంజ్జపల్ సెక్రటరీ వక్కలంక శ్రీరామచంద్రం, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ విశ్వనాథం భాస్కరరావు, కోశాధికారి వి.కృష్ణకుమారి తదితరుల సారథ్యంలో కళాకారులను సత్కరించారు. బుధవారం సాయంత్రం 6.30 గంటలకు సాహితీ వైజయంతి సాహిత్య రూపకం ప్రదర్శించనున్నారు.

నేడు ఇంటర్వ్యూలు

రాజమహేంద్రవరం రూరల్: అమర్‌రాజా కంపనీలో వివిధ ఉద్యోగాల భర్తీకి ధవళేశ్వరంలోని ప్రభుత్వ ఐటీఐలో బుధవారం నియామక ప్రక్రియ జరుగుతుందని ప్రిన్సిపాల్ సీహెచ్ సునీల్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్‌తో పాటు, ఐటీలలో అన్ని ట్రేడుల్లో ఉత్తీర్ణులైన వారికి, డిగ్రీ పాసయిన వారికి వివిధ ఉద్యోగావకాశాలున్నాయని వివరించారు. ఆర్హత కలిగిన అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో తమ ఐటీలలో హాజరు కావాలని సూచించారు. ఐటీల రెండో సంవత్సరం, ఒక సంవత్సరం కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ అవకాశాలున్నాయని సునీల్ కుమార్ తెలిపారు.

ఇంటి గ్యాస్‌తో వాణిజ్యమంట

- వక్కదారి పడుతున్న డొమెస్టిక్ సిలిండర్లు
- కొరవడిన పర్యవేక్షణ

రాజమహేంద్రవరం రూరల్: నగరంతో పాటు పరిసర గ్రామాల్లో వంటగ్యాస్ సిలిండర్ల అక్రమ దందా జోరుగా సాగుతోంది. గృహవినియోగాలకు (డొమెస్టిక్) కేటాయించిన సిలిండర్లు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో బహిరంగంగానే వక్కదారి పడుతున్నాయి. పశ్చిమాసియా యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపుతూ, కొంత మంది ఈ అక్రమ దందా సాగిస్తున్నారు. వాణిజ్య సిలిండర్ల ధరలను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా భారీగా పెంచేయడం, వాటి లభ్యతపై ఆంక్షలుండటంతో కొంత మంది వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు.

నిబంధనలు కాలరాసి..

గత నెలలో రూ.2,322 ఉన్న 19 కేజీల వాణిజ్య సిలిండర్ ధరను కొద్ది రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం ఏకంగా రూ.993 మేర పెంచేసింది. దీంతో, దీని ధర అమాంతం రూ.3,315కు పెరిగింది. ఇది మోయలేని భారం కావడంతో చిన్న, పెద్ద వ్యాపార సంస్థలు, హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వాహకులు డొమెస్టిక్ సిలిండర్ల పైనే ఆధారపడుతున్నాయి. ఇదే అదనుగా కొంత మంది గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు, డెలివరీ బాయ్స్ సామాన్యుడి పొయ్యి కింద సెగ పెడుతున్నారు. అదనపు సొమ్ము ఇస్తే చాలు, నిబంధనలతో సంబంధం లేకుండా డొమెస్టిక్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు సరఫరా చేస్తున్నారు. అసలు ధర కంటే రూ.800 నుంచి రూ.1,000 వరకూ అదనంగా వసూలు చేస్తూ డొమెస్టిక్ సిలిండర్లను హోటళ్లకు మళ్లిస్తున్నారు. సిలిండర్ డెలివరీ సందర్భంగా భద్రత కోసం ప్రవేశపెట్టిన ఓటీపీ విధానాన్ని పూర్తిగా తుంగలో తొక్కుతున్నారు. ఆడిగినంత డబ్బు ఇస్తే ఓటీపీతో పని లేకుండానే సిలిండర్లు ఇచ్చేస్తున్నారు. ఫలితంగా గ్యాస్ బుక్ చేసుకున్నా, మొబైల్‌కు ఓటీపీ వచ్చినా, 15 రోజులైనా సిలిండర్ ఇంటికి రాక సాధారణ వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. తమ సిలిండర్ ఎవ్వరుదొస్తుందో తెలియక ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. జాబ్వంపై నిలదీస్తే అంతా డెలివరీ బాయ్స్ చేస్తున్న పనేనంటూ గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు తప్పించుకుంటున్నారు. గ్యాస్ కుత్రిమ కొరత వెనుక పెద్ద నెట్‌వర్క్ ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ దందా బహిరంగంగానే సాగుతున్నా పౌర సరఫరాలు, విజిలెన్స్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రారంభంలో కొన్ని దాడులు చేసినా, ఆ తర్వాత నిఘాను గాలికొదిలేశారు. ఫలితంగానే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు వాణిజ్య అవసరాలకు మళ్లుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేయాలని, ఓటీపీ విధానం సక్రమంగా అమలయ్యేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఊడాలమ్మ ఘాట్ పరిశీలన

ఘాట్‌ను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి మూర్తి తదితరులు

కడియం: వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల సేవభ్యంలో వేమగిరిలోని ఊడాలమ్మ ఘాట్‌ను ప్రత్యేకాధికారి ఎస్‌పీవీఎస్ మూర్తి మంగళవారం పరిశీలించారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తుల రాకపోకలకు వీలుగా చేయాల్సిన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, ఇతర భద్రతా చర్యలపై తహసీల్దార్ సునీల్ కుమార్, ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావులతో సమీక్షించారు. క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన పలు చర్యలను వివరించారు.

భజే వాయుపుత్రం

'శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం.. భజే వాయుపుత్రం.. శ్రీరామదూతం శిరసా నమామి' అంటూ పవన సుతుడైన ఆంజనేయ స్వామికి భక్తులు ప్రణతులిచారు. హనుమజ్జయంతి సందర్భంగా వాడవాడలా ఆ స్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. తమను చల్లగా కరుణించాలని, జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఎదుర్కొనే ధైర్యాన్నివ్వాలని ప్రార్థించారు.

- వైభవంగా హనుమజ్జయంతి
- స్వామివారికి ఘనంగా పూజలు

కడియంలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు శ్రీ భక్తాంజనేయజనేయ స్వామి ఆలయంలో శ్రీ సరస్వతి బాలభక్త భజన సమాజం, గీతా వికాస్ భజన బృందం ఆధ్వర్యాన ఉదయం 7 గంటలకు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి, మంచాయుత ఏకహార అఖిల్ ఎకాలా, నాగవల్లి సహిత సిందూర పూజలు, గీతా వికాస్ బృందం ఆధ్వర్యాన 108 నామ్లు హనుమాన్ చాలీసా పారాయణ, భక్తుల గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేశారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

- బొమ్మూరు వద్ద జాతీయ రహదారి పక్కన ఆంజేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించారు.
- కవలగొయ్యి గ్రామంలో సీతారాములక్ష్మణ సమేత సువర్చలా సహిత ఆంజనేయ వీరలనే స్వామివారికి లక్ష సింధూర, విశేష పూజలు, విశేష నివేదనలు ఘనంగా నిర్వహించారు.

ఐదు బళ్ల మార్కెట్ సెంటర్‌లో..

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): స్థానిక ఐదు బళ్ల మార్కెట్ సెంటర్‌లో వేంచేసియున్న ప్రసన్నాంజనేయస్వామి వారి 32వ జయంత్యుత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారికి పంచామృతాభిషేకం, తమలపాకులతో పూజలు నిర్వహించారు. స్వామివారిని వరమ శివుని రూపంలో అలంకరించారు.

కడియం మండలంలో..

కడియం: మండల కేంద్రమైన కడియం, వేమగిరి, బుర్రిలంక, కడియపులంక, పాట్టిలంక, మురమండ, దుళ్ల, మాధవరాయుడుపాలెం, జీగురుపాడు, కడియపు సావరం తదితర గ్రామాల్లో ఆంజనేయ స్వామి వారికి తెల్లవారుజామున నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకార్చనలు, హోమాలు నిర్వహించారు. కడియం, పాట్టిలంక గ్రామాల్లో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కడియపులంక పాత పువ్వుల మార్కెట్లోని అభయాంజనేయ స్వామి ఆలయాన్ని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ దర్శించుకున్నారు. స్వామి వారికి తులాభారం సమర్పించారు. పాట్టిలంక వద్ద జాతీయ రహదారిపై ఉన్న ఆంజనేయ స్వామి వారి భారీ విగ్రహం వద్ద స్వామి వారిని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) మాజీ ఛైర్మన్ ఆకుల వీర్రాజు, రాష్ట్ర బ్యూటిఫికేషన్, గ్రీనింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు దర్శించుకున్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి వారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. హనుమజ్జయంతి సందర్భంగా భక్తులు పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలాచరించి ఆయా ఆలయాల్లో స్వామి వారికి లక్ష తమలపాకులు, సిందూరంతో పూజలుకు, అభిషేకాలు, ఆంజనేయస్వామి వారి సామూహిక ప్రవాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ఏకాహం (24 గంటల భజన) చేపట్టారు. మహిళలు ఆలయాల్లో లలిత సహస్ర నామం, విష్ణు సహస్ర నామ పారాయణలు చేశారు.

తొర్రేడులో భక్తాంజనేయస్వామి

ఐదు బళ్ల మార్కెట్ వద్ద ప్రసన్నాంజనేయ స్వామి

తొర్రేడులో హనుమాన్ చాలీసా పారాయణ చేస్తున్న గీతా వికాస్ సభ్యులు

కోరుకొండ మండలంలో..

కోరుకొండ: హనుమజ్జయంతి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆంజనేయ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. బూరుగుపూడి జంక్షన్‌లో ఆలయ కమిటీ, ఆటో యూనియన్ ఆధ్వర్యాన భారీ అన్న సమారాధన జరిగింది. బూరుగుపూడి రామాలయం సెంటర్‌లో యువకులు మజ్జిగ వితరణ చేశారు. శ్రీరంగపట్నంలో కూడా అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కురుకూరి సుబ్రహ్మణ్యం, ఆటో యూనియన్ అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రాజానగరంలో వైభవంగా శోభాయాత్ర

రాజానగరం: హనుమజ్జయంతి.. అందునా ఆ స్వామికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు పోటెత్తారు. వేకువజాము నుంచే పూలు, పండ్లు, పాలు, తమలపాకులతో వచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామిని అభిషేకించి, పూజలు చేశారు. రాజానగరం పిడిటీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కొలువుతీరిన ప్రసన్నాంజనేయ స్వామితో పాటు స్థానిక హైస్కూల్ సెంటర్‌లోని పంచముఖాంజనేయస్వామి, రావుల చెరువు గట్టున కోదండ రామాలయం వద్ద భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ చేపట్టారు. స్థానిక హైస్కూల్ జంక్షన్ నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు బైకులపై శోభాయాత్ర నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగి, సూర్యారావుపేట, జూలీయ రహదారి మీదుగా తిరిగి రాజానగరం వరకూ సాగిన ఈ యాత్ర అందరినీ అలరించింది. శోభాయాత్రలో భక్తులు కాషాయ జెండాలు చేబూని, జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. స్వామి నామస్మరణతో రాజానగరం వీధులు ప్రతిధ్వనించాయి. మండలలోని పుణ్యక్షేత్రం, తుంగపాడు, తోకాడ, చక్రద్వారబంధం, వెలుగుబంద, దివాన్ చెరువు, శ్రీరామపురం, పాలచర్ల తదితర ప్రాంతాల్లో హనుమజ్జయంతి తత్సవాలు కన్నుల పండుగగా జరిగాయి. పలువోట్ల అన్న సమారాధనలు నిర్వహించారు.

రాజానగరంలో సాగుతున్న శోభాయాత్ర

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

కడియం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యా శాఖాధికారి (డీఈఓ) కె.వాసుదేవరావు కోరారు. దుళ్ల గ్రామంలోని నంబర్-1 ప్రాథమిక పాఠశాల పరిధిలో మంగళవారం జరిగిన ప్రభుత్వ బడి పిలుస్తోంది రా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి, విద్యార్థులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడిపట్టు నిండిన చిన్నారులకు 440 మంది ఉండగా, ఇప్పటి వరకూ 123 మంది మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో చేరారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించి విద్యార్థులను చేర్పించాలని ఆదేశించారు. ఇప్పటికే 25 మంది విద్యార్థులు చేరేలా కృషి చేసిన ప్రధానోపాధ్యాయుడు ఆనందీను డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ మణిక మార్, ప్రధానోపాధ్యాయులు ఎం.సంధ్యారాణి, బి.సుధ, కె.జయలక్ష్మి, పాల్ విజయకుమార్, డేవిడ్, శరత్, సీఆర్‌పీలు, పీటీలు పాల్గొన్నారు.

దుళ్లలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న డీఈఓ వాసుదేవరావు, ఉపాధ్యాయులు

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజానగరం: దివాన్ చెరువులోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణపరమైన మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ ఈశ జె.నరసింహస్వామి మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఆ సమయంలో శ్రీరామపురం, రాళ్ ఎవెన్యూ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

సీతానగరం: సింగవరం శివారున పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, రూ.2,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వినయ్ ప్రతాప్ మంగళవారం తెలిపారు. ఈ బదుగురూ వంగలపూడి, సింగవరం గ్రామాలకు చెందిన వారన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరచుతామని తెలిపారు.

కార్మికులపై అణచివేత చర్యలు ఆపాలి

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): నోయిడా, గ్రేటర్ నోయిడా, మనేసర్, గురుగ్రామ్, ఫరీదాబాద్, ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లోని కార్మికులపై అణచివేత చర్యలను తక్షణం నిలిపివేయాలని ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐఐఈయూ) రాజమండ్రి డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాచ్చాన్స్, ఎం.కోదండరామ్ డిమాండ్ చేశారు. ఆ కార్మికులకు మద్దతుగా జాతీయ డిమాండ్స్ దే సందర్భంగా ఎల్‌ఐసీ డివిజనల్ కార్యాలయం ముందు భోజన విరామ సమయంలో ఉద్యోగులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. మాచ్చాన్స్, కోదండరామ్ మాట్లాడుతూ, అమానుష దోపిడీ, తక్కువ జీతాలు, దుర్భర పని పరిస్థితులు, పెరుగుతున్న కాంట్రాక్టు విధానానికి వ్యతిరేకంగా ఆ ప్రాంతాల్లోని కార్మికులు వైరుధ్యాగా పోరాడుతున్నారని అన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాల్సిన ప్రభుత్వాలు, వారిపై అరెస్టులు, బెదిరింపులు, యూనియన్ నాయకులపై తప్పుడు కేసులతో అణచివేత చర్యలకు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశ్రామిక కార్మిక శక్తిలో ప్రస్తుతం కాంట్రాక్ట్ కార్మికులే పెద్ద సంఖ్యలో ఉన్నారని అన్నారు. ఉద్యోగ భద్రత, ఓవర్‌టైమ్ చెల్లింపు, వారానికి విశ్రాంతి, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రాథమిక భద్రతా చర్యల వంటి హక్కులు కూడా వారికి లేవని వివరించారు. ద్రవ్యోల్బణం, గ్యాస్ ధరల పెరుగుదలతో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. ఈ సమస్యలతో అణచివేత చర్యలకు పాల్పడుతున్నవారి